క్లుప్తంగా

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణం

గండేడ్: వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం జంగంరెడ్డిపల్లిలో స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు సర్పంచ్ హన్మంతు తెలిపారు. మంగళవాయిద్యం, కల్యాణోత్సవం, రథోత్సవం, సోమవారం ప్రత్యేక పూజలు, దీపోత్సవం, మంగళవారం మంగళవాయిద్యం, బాలభోగం, వసంతోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వెన్నాచేడ్‌లో వెంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం, రథోత్సవం నిర్వహించనున్నట్లు సర్పంచ్ పుల్లారెడ్డి తెలిపారు.

అప్‌గ్రేడ్ చేయాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పండిట్, పీఈటీలను అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల ప్రకారం పండిట్, పీఈటీలను అప్‌గ్రేడ్ చేసేందుకు సుమారు 10వేల పోస్టులకు గతంలో ఉత్తర్వులు ఇచ్చిందని, ఇప్పటి వరకు అమలు కావడం లేదని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, శ్రీరాములు, సురేందర్‌నాథ్, రాజ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ పార్మసీ కళాశాల విద్యార్థులపై ఉన్న డిటెన్షన్ విధానాన్ని ఎత్తి వేయాలని ఎంఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పీయూ రిజిస్ట్రార్ గిరిజకు వినతిపత్రం అందజేశారు. బ్యాక్‌లాగ్ ఉన్నావారికి చివరి సెమిస్టర్‌కు అనుమతించడం లేదని, కేయూ, జేఎన్టీయూలలో ఇటువంటి నిబంధనలు లేవని, సెమిస్టర్‌కు అనుమతించాలని పేర్కొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

భూత్పూర్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈనెల 7న జరిగే టీయూడబ్ల్యూజే 143 మహాసభలను విజయవంతం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు ఆర్.యాదగిరి, ఉపాధ్యక్షుడు శంకర్‌నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కమిటీ సభ్యులతో పాటు జిల్లాలోని ఇతర మండలాలకు చెందిన కమిటీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

పశు సంపదను కాపాడుకోవాలి



గండేడ్: గ్రామీణ ప్రజలకు పశుసంపద ప్రధాన ఆదాయ వనరు అని, కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సర్పంచ్ ఖాజప్ప, మండల పశువైద్యాధికారి రాంప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని జిన్నారంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. 42 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించడంతో పాటు 25 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. 32 దూడలకు బ్రుసెల్లా వ్యాధి నివారణ టీకాలు, 15 పశువులకు సాధారణ చికిత్సలు చేసినట్లు వైద్యులు తెలిపారు. శిబిరంలో ఆర్ఎస్ఎస్ చైర్మన్ గోపాల్, పశువైద్య సిబ్బంది మంగమ్మ, జయంతి, రాములు, మల్లయ్య, గోపాల్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్‌కు అవార్డు

జడ్చర్ల టౌన్: గంగాపురం గ్రామ పర్సన్ ఆఫ్ ద ఇయర్‌గా మార్కెట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డిని ఎంపిక చేసి అవార్డును అందజేశారు. గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ అసోసియేషన్ ప్రతి ఏటా గ్రామంలో ఒకరిని పర్సన్ ఆఫ్ ద ఇయర్‌గా ఎంపిక చేస్తున్నారు. ఈ ఏడాది చైర్మన్‌ను ఎంపిక చేసి అవార్డును అందజేశారు. గ్రామంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నందుకు ఆయనను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాములు, మాజీ సర్పంచ్ అనంత్‌రెడ్డి, అసోసియేషన్ నిర్వాహకులు క్రాంతి, నాగరాజు, భరత్, కిరణ్, రఫీక్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మిడ్జిల్: మండలంలోని మల్లాపూర్‌లో శనివారం రూ.20లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులను జెడ్పీటీసీ శశిరేఖా ప్రారంభించారు. పనులను నాణ్యతగా, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగారెడ్డి, కృష్ణారెడ్డి, విష్ణువాస్‌రెడ్డి, దశరథచారి, వెంకటయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

భూత్పూర్: మున్సిపాలిటీ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. బంధువులు, పట్టణ ప్రజల కథనం మేరకు పట్టణంలోని జాతీయ రహదారిపై కొత్తకోట నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న ఏపీ28బీఎస్1322 నంబరు గల కారు, ముందుగా వెళ్తున్న మోటర్‌సైకిల్‌ను ఢీకొట్టింది. మోటర్‌సైకిల్‌పై వెళ్తున్న భూత్పూర్ మండలం పోతులమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని గోపన్నపల్లికి చెందిన ఉత్తన్నకు ఎడమ కాలు విరిగింది. చికిత్స నిమిత్తం పట్టణంలోని పంచవటి ఆస్పత్రికి తరలించారు.

అసంపూర్తి పనులతో ఇబ్బందులు

- మూడో వార్డులో తిష్టవేసిన సమస్యలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- అసంపూర్తిగా అప్పన్నపల్లి–ఎదిర అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం



శ్రీరాంకాలనీలోని ఓ ఫ్యాక్టరీ నుంచి బయటకు వెలువడుతున్న మురుగు



అసంపూర్తిగా ఉన్న అండర్‌పాస్ బ్రిడ్జిలో నిలిచిన నీరు

వార్డు నంబర్	3
మొత్తం జనాభా	5,789

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని 3వ వార్డులో సమస్యలతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో మీకు మేమున్నాం.. ఎలాంటి సమస్యలు రాకుండా అండగా ఉంటామంటూ ప్రగల్భాలు పలికిన వార్డు కౌన్సిలర్ గెలిచిన తరువాత ఇప్పటి వరకు వార్డు ముఖం కూడా చూడలేదని 3వ వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందులు, కుక్కలు తిరుగుతుండటంతో చిన్నపిల్లలు గాయాల పాలవుతున్నారని తెలిపారు. మిషన్ భగీరథ నీరు కొద్దిసేపు మాత్రమే వస్తున్నాయని, కనీసం అరగంట పాటు వదలాలని కోరారు. వార్డు కౌన్సిలర్ సమస్యలను పట్టించుకోవడం లేదని, గెలిచాక ఇప్పటి వరకు ఇటు వైపు రాలేదని ఆరోపించారు.

డ్రెయినేజీలు లేక ఇబ్బందులు..

15ఏళ్ల కిందటే శ్రీరాంకాలనీ వెలిసింది. వందలాది కొత్త ఇళ్లు నిర్మాణమయ్యాయి. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎవరికి వారు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకున్నారు. వీధుల్లో మట్టిరోడ్లే శరణ్యమయ్యాయి. చిప్స్ తయారీ కేంద్రం నుంచి వచ్చే వ్యర్థాలు, మురుగుతో అవస్థలు తప్పడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.

రెండేళ్లయినా పూర్తికాని అండర్‌పాస్

అప్పన్నపల్లి విలీన గ్రామం కావడంతో కేవలం మూడు సీసీరోడ్లు మాత్రమే నిర్మించారు. ఆయా వీధుల్లో డ్రెయినేజీలు లేవు. విస్తరణలో భాగంగా కొన్ని నెలలుగా ట్రాక్‌పై రెండో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మిస్తున్నారు. సమీపంలోని ఇళ్లు కోల్పోయిన వారికి నష్ట పరిహారం అందినా డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించలేదని బాధితులు వాపోతున్నారు. అప్పన్నపల్లి నుంచి ఎదిరకు వెళ్లే దారిలో అండర్‌పాస్ రెండేళ్లుగా అసంపూర్తిగా ఉంది. మొత్తం నీటితో నిండిపోయింది. డబుల్ లైన్ రైల్వే ట్రాక్‌పై నుంచే కాలినడకన వెళ్లాల్సి వస్తోందన్నారు. అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్‌ను తొలగిస్తేనే మిగిలిన పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ చెబుతున్నారు. ఈ వార్డు పరిధిలోని తిరుమల హిల్స్‌లో రాత్రివేళ దొంగల బెడద ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొత్తగా వెలసిన క్రాంతినగర్, శ్రీనగర్, బృందావన్, శ్రీరాంనగర్ కాలనీల్లో ఇంకా మిషన్ భగీరథ పైపులైన్‌ను విస్తరించలేదు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

తాగునీటికి ఇబ్బందులు..



మిషన్ భగీరథ పథకం నుంచి కనీసం 10నిమిషాలైనా తాగునీరు రాదు. పారిశుద్ధ్య కార్మికులు డ్రెయినేజీలో చెత్తతీసి అక్కడే వదిలేస్తున్నారు. దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నాం. ఓపెన్ ప్లాట్లలో చెత్త పేరుకుపోయింది. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– మల్లేశ్‌యాదవ్, ఎనుగొండ

అండర్ పాస్ పూర్తి చేయాలి..



రెండేళ్లుగా అండర్‌పాస్ బ్రిడ్జి అసంపూర్తిగా ఉంది. బ్రిడ్జి కింద చేరిన నీటితో పాటు రెండువైపులా ఉన్న అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్‌ను తొలగించాలి. ఎదిరకు రైల్వే ట్రాక్‌పై నుంచే వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి అండర్‌పాస్‌ను పూర్తిచేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– హన్మంతు, అప్పన్నపల్లి

పనులు పూర్తి చేస్తాం..



అప్పన్నపల్లిలోని అండర్‌పాస్ పనులను త్వరలోనే పూర్తి చేయిస్తాం. అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్‌ను తొలగించేందుకు ట్రాన్స్‌కో అధికారులు అంగీకరించారు. సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాల్సి ఉంది. నిధులు మంజూరైనా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

– రామాంజనేయులు, కౌన్సిలర్

లక్ష్యాన్ని సాధించే తపన ఉండాలి



మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ మండలంలోని జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్య–అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లక్ష్యసాధనకు ఎవరైనా అర్హులేనని, అందుకు తపన ఉన్న ప్రతి ఒక్కరూ జీవితంలో విజేతలుగా నిలుస్తారని పేర్కొన్నారు. సమాజంలో ఇంజనీర్ లేనిది వ్యవస్థ లేదని, వారి పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ప్రస్తుతం మొబైల్ వల్ల ఏకాగ్రత దెబ్బతింటుందని, సాధ్యమైనంత వరకు అవసరానికి వాడుకుంటూ అవసర విషయాల్లో దూరంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ ఐటీ ప్రిన్సిపాల్ రాంచంద్రారెడ్డి, ఫ్రీలాన్స్ ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ ప్రతినిధి రమేష్ విప్పర్తి, కళాశాల చైర్మన్ రవికుమార్, కార్యదర్శి వెంకటరామారావు, ప్రిన్సిపాల్ సుజీవన్ పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో జిల్లా పరిశోధకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాజమండ్రిలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు, భారతీయ భాషా సంస్థ–మైసూర్, ఆది కవి నన్నయ్య విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాతీయ సదస్సులో జిల్లాకు చెందిన పరిశోధకులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, డాక్టర్ గుంటి గోపి పాల్గొన్నారు. డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ 'తెలుగు నీతి శతకాలు–సామాజిక దృక్పథం' అనే అంశంపై, డాక్టర్ గుంటి గోపి 'పాలమూరు జిల్లా గ్రామనామాలు–సామాజిక సాంస్కృతిక దృక్పథం' అనే అంశంపై పత్ర సమర్పణలు చేశారు. అనంతరం వీరికి సదస్సు సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ సెమినార్ సర్టిఫికెట్లు అందజేశారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని శనివారం ఢిల్లీలో తెలంగాణ ప్రత్యేక అధికార ప్రతినిధి డాక్టర్ మందా జగన్నాథాన్ని దళిత సంఘాల నాయకులు కలిసి విన్నవించారు. ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ తీర్మానం చేసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సమర్పించినట్లు గుర్తుచేశారు. ఇందుకు మందా జగన్నాథం స్పందిస్తూ ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర మంత్రులు, ఎంపీలతో మాట్లాడి ఒత్తిడి తీసుకురావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాస్, సింగిరెడ్డి పరమేశ్వర్, కాశపోగు జాన్ తదితరులు ఉన్నారు.

చౌడేశ్వరిదేవి అఖండ జ్యోతి ఉత్సవాలు



జల్దిబిందే ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రం వీరన్నపేటలోగల శ్రీ చౌడేశ్వరిదేవి అఖండ జ్యోతి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి క్షీరాభిషేకం, అలంకార సేవ, సహస్రపుష్పార్చన, నైవేద్యం, మంగళహారతితో పాటు సాయంత్రం 4 గంటలకు జల్దిబిందే ఊరేగింపు, లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఆదివారం అమ్మవారి అఖండ జ్యోతుల ఊరేగింపు ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని శ్రీతొగట వీరక్షత్రీయ సేవా సంఘం ప్రతినిధులు కోరారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, భక్తులు

జడ్చర్ల టౌన్: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం వేంకటేశ్వరస్వామిని జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మిలు దర్శించుకున్నారు. కల్యాణోత్సవం అనంతరం పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జ్యోతి తదితరులు ఉన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి

నవాబుపేట: బీఎస్పీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాలవర్ధన్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాంచంద్రయ్య, శ్రీకాంత్, చెన్నయ్య, భానుప్రసాద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విప్లవ కవి, కమ్యూనిస్టు ఉద్యమ, కార్మిక నేత మఖ్దూం మొహినిద్దీన్ స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రభుత్వాలపై పోరాటలకు సిద్ధమవుతామని సీపీఐ జిల్లా సహాయ కర్యాదర్శి రామ్మోహన్ అన్నారు. శనివారం సీపీఐ కార్యాలయంలో మఖ్దూం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మట్లాడుతూ మెదక్ జిల్లాకు చెందిన మఖ్దూం హైదరాబాద్‌లో 1940లో విద్యార్థి యూనియన్‌ను స్థాపించినట్లు తెలిపారు. ఎన్నో కవితలను రచించి ప్రజలను చైతన్యం చేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సురేష్, పట్టణ కార్యదర్శి విల్సన్, కార్యవర్గ సభ్యుడు డి.రాము, సంతోష్, ప్రకాష్, రిజియాబేగం, భాగ్యలక్ష్మి, శారద, లక్ష్మమ్మ, జ్యోతి, శ్వేత, చంద్రకళ పాల్గొన్నారు.

ఆదర్శనగర్‌లో అన్నదానం

మహబూబ్‌నగర్ రూరల్: అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకురాలు సరోజనమ్మ తన తల్లి రాజమ్మ జ్ఞాపకార్థం నిరుపేదలకు అన్నదానం చేశారు.

కిట్ల పంపిణీ..

పాలమూరు: మహబూబ్‌నగర్ ఆదరణ పాజిటివ్ నెట్‌వర్క్ అధ్యక్షురాలు భారతి ఆధ్వర్యంలో జిల్లా జనరల్ ఆస్పత్రిలో శనివారం హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధితో జీవిస్తున్న పిల్లలకు, గర్భిణులకు, ఇతరులకు పౌష్టికాహారం కిట్లను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకిషన్ అందజేశారు.



బీజేపీ బలోపేతానికి పనిచేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు సుదర్శన్‌రెడ్డి

పాలమూరు: బీజేపీ పట్టణ అధ్యక్షుడు నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం కార్యవర్గ సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి పి.చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి, జిల్లా ఇన్‌చార్జ్ భరత్‌గౌడ్, ఎన్‌పీ వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

భూత్పూర్: బూత్ స్థాయిలో బీజేపీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ కార్యవర్గ సమావేశం పట్టణ అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బూత్ స్థాయిలో కేటాయించిన కమిటీలు చురుకుగా పనిచేయాలని, గెలుపే ధ్యేయంగా పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సుదర్శన్‌రెడ్డి, సత్తయ్య గౌడ్, అసెంబ్లీ ఇన్‌చార్జ్ రవీందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు, అర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న యువజన కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు వెంటనే నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి చెల్లించాలని పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ సల్మాన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ పిలుపుమేరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరుతూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఓకు అందజేశారు. నాలుగేళ్ల ప్రకారం ప్రతి ఒక్క నిరుద్యోగ యువతకు రూ.లక్షా50వేలకు పైగా నిరుద్యోగ భృతి మొత్తాన్ని ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం, రవీందర్, సంధ్య, అనిల్‌కుమార్ రెడ్డి, సంజీవరెడ్డి, గురునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు



క్రీడాప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి

గండేడ్: మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని జక్లపల్లిలో నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో మొక్కల పెంపకంలో సిబ్బంది నిర్లక్ష్యంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. షిఫ్టింగ్, గ్రేడింగ్ చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని నిలదీశారు. అనంతరం క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ఏపీఓ హేమచంద్రుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి

భూత్పూర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఎల్కిచర్లలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తండ్రి ఆల రఘుపతి రెడ్డి చారిటిబుల్ ట్రస్టు ద్వారా పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఎంపీపీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరేష్ గౌడ్, సర్పంచ్ పద్మ జక్కిరెడ్డి, ఎంపీటీసీ పద్మ, ఉప సర్పంచ్ గౌస్, హెచ్ఎం కవిత పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన..

మిడ్జిల్: మండలంలోని మల్లాపూర్, కొత్తూర్ ప్రాథమికోన్నత పాఠశాలలను శనివారం ఎంపీపీ తిరుపతమ్మ సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కొత్తూర్ పాఠశాలలో హెచ్ఎం కొన్ని నెలల నుంచి మెడికల్ లీవ్‌లో ఉండడం వల్ల విద్యార్థులకు ఇబ్బంది కల్గుతుందని ఎంఈఓకు తెలిపారు.

న్యూరిషి విద్యార్థులకు ఫీల్డ్ ట్రిప్



బట్టర్‌ఫ్లై పార్కులో విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని బాయమ్మతోట, రాజేంద్రనగర్‌లోని న్యూరిషి పాఠశాలలకు చెందిన ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు ఫీల్డ్ ట్రిప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్‌లోని రైల్వేస్టేషన్‌లో రైళ్ల రాకపోకలు, సిగ్నల్, టికెట్, ఫ్లాట్‌ఫామ్ తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే జిల్లాకేంద్రానికి సమీపంలో ఉన్న కేసీఆర్ అర్బన్ పార్క్ (మయూరీ గార్డెన్స్)కు తీసుకెళ్లారు. మనీ పార్క్, బట్టర్‌ఫ్లై పార్కులో విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ మల్లిఖార్జున్, రామకృష్ణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

దేవరకద్ర రూరల్: మండలంలోని కౌకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 1977–78 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు రూ.51వేలను విరాళంగా అందజేశారు. పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు చేయూతను అందించినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని సర్పంచ్ స్వప్న, హెచ్ఎం అబ్దుల్‌హక్ తెలిపారు. నగదుతో విద్యారులకు అవసరమైన సైన్స్ పరికరాలు, బీరువాలను కొనుగోలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లక్ష్మీనరసింహ, వెంకటేశ్వర్లు, జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాపడిపూజ



చిన్నచింతకుంట: మండలంలోని దాసర్‌పల్లిలో శనివారం శివమహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల పండ్లు, పూలతో పడి మెట్లను అలంకరించారు. అనంతరం శివలింగానికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి శివభక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అశోక్‌రెడ్డి కళాబృందం శివనామ కీర్తనలు ఎంతగానో అలరించాయి.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

మిడ్జిల్: మండల కేంద్రంలోని సేయింట్ మేరిస్ పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఎంపీపీ తిరుపతమ్మ, జెడ్పీటీసీ శశిరేఖా సందర్శించి విద్యార్థులను అభినందించారు.

